# సంస్కారం



రచన: శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు.

'పొరపాట్లు జరగటం మానవ సహజం! వాటిని సహృదయంతో క్షమించి మరిచిపోగలగటం దైవ లక్షణం!' – ఈ మాటలు లక్ష్మీపతికి తెలుసు. కాని ఈ మాటలతో ఏకీభవించటానికి మాత్రం అతని అంతరాత్మ ఒప్పుకోదు. 'పొరపాట్లు, తప్పులు అనేవి అసలు ఎందుకు రావాలి? ప్రతి విషయాన్నీ అతి జాగ్రత్తతో పరిశీలించి దిద్దుకొంటే పొరపాట్లనేవి రావు. జీవితంలో తప్పు చేసిన మనిషిని క్షమించకూడదు. ఒకసారి క్షమిస్తే ఆ వ్యక్తి మళ్ళీ తప్పులు చేయటానికి వెనుదీయడు. తప్పు చేసిన మనిషికి తగిన శిక్ష విధించవలసిందే!' – సంక్షిప్తంగా లక్ష్మీపతి ఆంతర్యం ఇది!!

రైలు వేగంగానే సాగిపోతోంది. మూడవ తరగతి రైలుపెట్టెలో పై 'బెర్తు' మీద, పడుకొని ఏదో ఇంగ్లీషు నవల చదువుకొంటున్నాడు లక్ష్మీపతి. అది చాలా చిన్న 'కంపార్టుమెంటు.' పెళ్ళిళ్ళ కాలం అవటంవలన కాబోలు రైలు అంతా చాలా రద్దీగా వుంది. పదహారుగురు కూర్చోవలసిన ఆ పెట్టెలో నలభైమందికి పైగా సర్దుకున్నారు.

రైలు పెద్దగా రొదచేస్తూ ఏదో స్టేషనులో ఆగి మళ్ళీ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ బయలుదేరింది. ఉన్న రద్దీ చాలక టికెట్ కలక్టరు కూడా జనాన్ని తప్పించుకుంటూ ఆ కంపార్టుమెంటులోనికి అడుగు పెట్టాడు. గొంతు చించుకొని అరుస్తూ తణిఖీ ప్రారంభించాడు.

లక్ష్మీపతి నవల చదవటం ఆపి బద్ధకంగా ఒళ్లు విరుచుకొని క్రిందవైపుకు చూశాడు. ఎదురుగావున్న దిగువసీటులో ఒక వ్యక్తి కూర్చొని కిటికీలోనుండి బయటకు చూస్తున్నాడు. మాసిపోయిన గడ్డం, ఎర్రగా వెలిగిపోతున్న కళ్లు, బిగువైన బట్టలు; మనిషి చూడటానికి చాలా బాధగా వున్నాడు. అప్రయత్నంగా లక్ష్మీపతి చూపులు అతని మీద నిలిచిపోయాయి. అతన్ని తదేకంగా చూస్తూవుంటే మనసులో భయంలాటిది కలిగింది. సాధారణంగా రైలులో దొంగతనాలు చేసే వ్యక్తులు ఇలాగే వుంటారని లక్ష్మీపతి అభిప్రాయం.

ఇంతలో టి. సి. ఆ వ్యక్తి వద్దకు వచ్చి అడిగాడు. 'మీ టిక్కట్టు చూపిస్తారా?' ఆ వ్యక్తి ప్రక్క జేబులోనుండి టిక్కట్టు తీసి అందించాడు. ఆ టిక్కట్టు పరిశీలించి 'ఎక్కడనుండి వస్తున్నావ్?' కఠినంగా అడిగాడు టి. సి.

తను ఎక్కడనుండి వస్తున్నదీ ముక్తసరిగా సమాధానం ఇచ్చాడా వ్యక్తి!

'ఎక్కడివరకు వెళ్తావ్?' టి. సి. మాటల్లో ఈసారి కర్కశత్వం ధ్వనించింది.

'నిడదవోలు!'

'మరి ఈ టిక్కట్టు ఏమిటి? రైల్వేని ఇలా మోసగిస్తున్నావన్నమాట! ఈ 'ప్లాట్ ఫారం టిక్కట్టు'తో ఇలా ఎంతదూరం ప్రయాణం చేద్దామని?'

ఆ వ్యక్తి ఆశ్చర్యంతో టి. సి. చేతిలోని టిక్కట్టు అందుకొని చూశాడు. అతని ముఖంలో రంగులు మారిపోయాయి. క్షణంసేపు తటపటాయించి చివరకు అన్నాడు. 'క్షమించండి! నేను నిడదవోలు కోసమే డబ్బు ఇచ్చాను. కాని 'బుకింగ్ క్లర్కు' పొరపాటున

ప్లాట్‌ఫారం టిక్కెట్లు యిచ్చేశారు. రైలు ఎక్కే కంగారులో నేనుకూడా అది గమనించలేదు!'

'బుద్ధి లేకపోతే సరి! ఇలాంటి మాటలకు నేను లొంగను! మనదేశం ఇంత అధోగతి పాలయిందంటే నీలాటి మనుషుల్ని చూపించి వేరే కారణం చెప్ప నక్కరలేదు. టిక్కెట్టు డబ్బు జరిమానాతో సహా వెంటనే కట్టాలి!' అంటూ లెఖ్ఖ కట్టడంలో మునిగి పోయాడు.

ఆ వ్యక్తి కొంతసేపు నిర్వికారంగా టి. సి. వంక చూసి దీర్ఘంగా నిట్టూర్చి జేబులోనుండి డబ్బుతీసిఇచ్చేశాడు. ఇదంతా గమనిస్తున్న లక్ష్మీపతికి ఎదుటి వ్యక్తి మీద అసహ్యం పెరిగింది. 'ఎంత ధైర్యం? ప్లాట్‌ఫారం టిక్కెట్టుతో దర్జాగా ప్రయాణం సాగిస్తున్నాడు. పైగా చేసిన పనికి సమర్ధించుకోవడం ఒకటి! పొరపాటు జరిగిపోయిందట! టి. సి. చెప్పినట్లు మన దేశం ఇలాటి మనుష్యుల వలననే ఇలా తయారయింది. బొత్తిగా నీతికి విలువ ఒకరోజు కొకరోజు దిగజారి పోతోంది. ఎక్కడ చూచినా దగా! మోసం!' అనుకున్నాడు మనస్సులో. అనుకోవటమే కాదు—ఆ భావాన్ని బయటకుకూడా వ్యక్తం చేశాడు. 'ప్రతిదినం రైళ్లలో చాలామంది వ్యక్తులు ఇలా మోసగించి ప్రయాణం చేస్తున్నారు. వీళ్ళవలన ప్రతి ఏటా కోటకోలది రూపాయలు ప్రభుత్వానికి నష్టం వస్తోందని మన మంత్రులు ఘోషిస్తున్నారు. ఇలాంటి వాళ్ళ నందరినీ క్షమించకూడదు!' ఉపన్యాస ధోరణిలో మాట్లాడి క్రింది వ్యక్తులవైపు చూశాడు లక్ష్మీపతి. కొందరు అంగీకార సూచకంగా తల వూపారు. కొంతమంది మాత్రం ముఖం చిట్లించుకొని ఊరుకున్నారు. 'దొరికిపోయా' నన్న భావంతో కాబోలు ఆ వ్యక్తి మాత్రం బిత్తరగా చూస్తున్నాడు.

అందరి టిక్కెట్లు పరిశీలించి యాధాలాపంగా లక్ష్మీపతి 'బెర్తు' వద్దకు వచ్చి చేతిని నిటారుగా జాపాడు టి. సి. చిన్న మందహాసంతో తన జేబులోని టిక్కెట్లు తీసి అతని చేతికి అందించాడు నిర్లక్ష్యంగా!

టిక్కెట్టు పరిశీలించి టి. సి. వింతగా నవ్వాడు! అలా నవ్వుతూ ఉంటే లక్ష్మీపతికి ఏదో అనుమానం కల్గింది.

'మిస్టర్! తమ రెంతవరకూ దయ చేస్తున్నారు?' ఆ మాటలలోని వ్యంగ్యం తన మనసుమీద సూదులతో గ్రుచ్చుతున్నట్లు వుంది. ఇందాకా ఆ దొంగ వెధవను అడిగిన తీరులోనూ, తనను ప్రశ్నించిన తీరులోనూ ఆట్టే తేడా కన్పించలేదు లక్ష్మీపతికి.

'వాల్తేరు వరకూ...!' కొంచెం బెరుకుగానే సమాధాన మిచ్చాడు.

'ఈ టిక్కెట్టు చూడండి!' టిక్కెట్టు తన చేతి కిచ్చాడు - కాదు! నిప్పు తన చేతిలో పెట్టినట్లయింది! కళ్ళు తిరిగిపోతున్నాయి! పెట్టెలోని వ్యక్తులందరి చూపులూ తనమీదే కేంద్రీకృతమై వున్నట్లు, అందరూ వెకిలిగా నవ్వుతున్నట్లూ అనిపించింది.

అది ప్లాట్‌ఫారం టిక్కెట్టు!!!

అవమానంతో నోట మాట రాలేదు! ఆ క్షణంలో రైలు తిరగబడిపోయినా బాగుండు ననిపించింది!! తను చేసిన పొరపాటు ఇప్పుడిప్పుడే అర్ధమవుతోంది. తనను సాగనంపటానికి తన బావమరిది వెంకట్రావు కూడా తనతో స్టేషనుకి వచ్చాడు. అతనికోసం ఒక ప్లాట్‌ఫారం టిక్కెట్టు కూడా తనే కొన్నాడు. రైలు కదిలే తొందరలో ఎక్కుతూ ప్లాట్‌ఫారం టిక్కెట్టుకు బదులు వాల్తేరు టిక్కెట్టును అతనికి ఇచ్చేశాడు.

తను టిక్కెట్టు కొనటం వాస్తవం! కాని ఈ నిజాన్ని ఎవరు నమ్ముతారు?

అనుకోకుండా పొరపాటు జరిగిపోయింది!!

తను నిజాయితీ అయిన మనిషే! కాని తనలోని ఈ నిజాయితీని ఎవరు గుర్తిస్తారు? - తలమీద పిడుగులు వర్షిస్తున్నట్లే వుంది, హృదయాన్ని ఎవరో అరచేతిలో పెట్టుకొని నలిపివేస్తున్నట్లు భావన కలుగుతోంది.

ఎదురుగా క్రింది వరసలో కూర్చున్న వ్యక్తికి కూడా ఇటువంటి పొరపాటే జరిగిందేమో! తను చెడుగా ఊహించి పెద్ద మాటలు చెప్పాడు - కాని తనే ఇలా చేసినందులకు కంపార్టుమెంటులోని వ్యక్తులందరూ తనను ఎంత నీచంగా ఊహిస్తున్నారు? మనసు అవమానంతో దహించుకుపోతూవుంటే బాధతో కళ్లు మూసుకున్నాడు లక్ష్మీపతి! అలా కళ్ళు మూసుకుని నిద్ర



పోతాడేమోనన్న భయపడ్డ టి. సి; పెన్సిలుతో లక్ష్మీపతి మోచేతిమీద పొడిచాడు.

పతి బరువుగా కళ్ళు విప్పాడు. యమదూత తన చేతిలోనున్న పాశం ఆడిస్తూన్నట్లు పెన్సిలు టొకాయిస్తూ ఎదురుగా నిలబడి తన వైపే పరిశీలనగా చూస్తూన్నాడు.

'మాట్లాడవేం - ?' అన్నట్లు వున్నాయి అతని చూపులు!

గొంతు పెగుల్చుకుంటూ అన్నాడు లక్ష్మీపతి 'వెరీ సారీ! మా బావమరిది నన్ను రైలు ఎక్కించటంకోసం స్టేషనుకు వచ్చాడు. అతనికోసం ఒక ప్లాట్ ఫారం టిక్కెట్ కూడా నేనే కొన్నాను. అది నావద్ద వుండిపోయింది. కంగారులో వాల్తేరు టిక్కెట్టు అతనికి ఇచ్చేశాను. పొరపాటు జరిగిపోయింది.

విసుగ్గా ముఖం చిట్లించాడు టి. సి. 'అందరికీ ఇదొక సాకు అయిపోయింది. మీలాటి చదువుకొన్న వాళ్ళే యిలా ప్రవర్తిస్తే ఎలా చెప్పండి?

'ఇందాకా పెద్ద మాటలు చెప్పావుకదా! ఇప్పుడు నీ సంగతేమిటి?' అని అంకుశంతో గుండెల్లో పొడుస్తూ అడిగినట్లు వున్నాయి ఆ మాటలు.

కంపార్టుమెంటులోని వ్యక్తులు తలొక విధంగా గుసగుసలాడుతూవుండే చెవులు చిల్లులుపడుతున్నాయి లక్ష్మీపతికి. జీవితంలో ఇంత ఇరుకునపడ్డ పరిస్థితి ఎన్నడూ ఏర్పడలేదు' అతనికి! ఆక్షణంలో ప్రాణం పోయినా బాగుండుననిపించింది.

'తను పలికిన మాటలకు పాపం ఆ గడ్డం మాసిన వ్యక్తి ఎంత బాధపడ్డాడో!' అనుకుంటూ అతనివైపు చూశాడు లక్ష్మీపతి. అతడు తన వంక సానుభూతి కురిపించే నేత్రాలతో చూస్తున్నాడు. ఆ చూపులకు తట్టుకోలేకపోయాడు లక్ష్మీపతి! 'తనుకూడా ఇటువంటి పరిస్థితిలో ఇరుక్కున్నందుకు కసితీరా రైలుపెట్టె బ్రద్దలయ్యేటంతటి శబ్దంతో నవ్వుతాడేమో!' అనుకున్నాడు. కాని అతను నవ్వటంలేదు! పగ తీర్చుకోవటం లేదు! తనకు కల్గిన దుస్థితికి-సానుభూతి కల్గించే నేత్రాలతో చూస్తున్నాడు!

'డబ్బు ఇవ్వండి! టిక్కెట్టు వ్రాస్తాను!'. టి. సి. విసుగుతో రసీదు పుస్తకం తెరిచాడు. లక్ష్మీపతి గుండెల్లో రాయి పడింది—మరో పెద్ద అనుభవం! శరీరం నీరు కారిపోతోంది! రక్తస్రావం ఆగినట్లయింది!

'టిక్కెట్టు కొన్నతరువాత తనవద్ద మిగిలినవి ఆరు రూపాయలు! వాటిలో కాఫీలకు, సిగరెట్లకు, పత్రికలకూ సుమారు రెండు రూపాయలు ఖర్చయిపోయింది. మళ్ళీ ఇపుడు పదిహేను రూపాయల వరకూ డబ్బు కట్టాలి! సూట్ కేసులో రెండు మాసిపోయిన జతలు వున్నాయి. ఈ పరిస్థితిలో తను ఏమాత్రంకూడా విలువ చెయ్యడు! ఒంటిమీద నలిగిన దుస్తులు, మాటల్లో దర్పం తనవద్ద ఇంకేమీ లేవు! ఏం చెయ్యటం?'

లక్ష్మీపతికి మతి పోతోంది!

చివరకు తెగించి అన్నాడు. 'చూడండి! ప్రస్తుతం నావద్ద వున్న డబ్బు చాలదు. వాల్తేరు స్టేషనులో నాకు తెలిసిన ఉద్యోగి ఒకాయన వున్నారు. రైలు దిగగానే ఆయనవద్దకు వెళ్ళి డబ్బు తీసుకొని ఇస్తాను. నన్ను నమ్మండి!'

'బాగుందండీ మీ వ్యవహారం! ఇంకా నయం—మీ ఇంటికి రమ్మన్నారుకాదు! నేను రాజమండ్రిలో దిగిపోతాను. డబ్బు వెంటనే కట్టెయ్యాలి! అయినా, ఫ్లాట్ ఫారం టిక్కెట్టుతో వాల్తేరు వరకూ ప్రయాణం సాగించటానికి సిద్ధపడ్డ మిమ్మల్ని, ఎలా నమ్మమంటారు?'

టి. సి. నోటవెంట వెలువడ్డ ప్రతిమాటా తుపాకీ గుళ్ళలా వచ్చి లక్ష్మీపతి హృదయాన్ని నాటుకొంటున్నాయి.

'అవును! తనని ఎవరు నమ్ముతారు?' కంపార్టుమెంటులో ఒక్కరయినా పరిచయమున్న వ్యక్తులు లేరు!'

టి. సి. మాటలు వింటూంటే అతన్ని కత్తితో పొడిచెయ్యాలని వుంది లక్ష్మీపతికి!

'భగవంతుడా! ఎటువంటి క్లిష్ట సమస్య కలిగించావ్?' అనుకున్నాడు మనసులోనే.

'నిన్ను నేను నమ్ముతున్నాను బాబూ! పొరపాట్లు రావటం మానవ జీవితంలో సహజం! ఇదిగో! ఈ డబ్బు తీసుకో! ఇంటికి వెళ్ళాక నాకు పంపించు. ఇటువంటి సమయాలలో తోటి మానవుణ్ణి ఆదుకోవటం కనీస ధర్మం!' గడ్డం మాసిన ఎదుటి సీటులోని వ్యక్తి ఆ మాటలు అంటూ పదిహేను రూపాయలు తన చేతిలో పెడుతూ వుంటే, మనసు పులకించిపోయింది లక్ష్మీపతికి! అనుకోకుండా రెండు భాష్పాలు కంటినుండి రాలాయి. జీవితంలో ఇలాటి అనుభవాన్ని ఎన్నడూ ఎదుర్కొని లక్ష్మీపతికి కృతజ్ఞత చెప్పటానికి కూడా నోరు పెగల్లేదు.

టి. సి. తల వంచుకొని రసీదు పుస్తకంలో గొలుకుతున్నాడు. రైలు వేగాన్ని పుంజుకుంటోంది!

ఆ వ్యక్తి సహృదయానికీ, సంస్కారానికీ, మనసులో జోహారు లర్పించాడు లక్ష్మీపతి!